# ★ ఉపకారము చేయబోతే ★

ఆ మహాపట్టణంలో నొక సందులో చివరగా మేడ కలదు. ఆ మేడముందు నొక వసారా యుండును. ఇంటికి నలుప్రక్కల కాళీస్థలము గలదు. ఇంటివెనుక భాగము అనేక పూలచెట్లతో, ఫల వృక్షభరితమై యున్నది. చిలుకలు ఇత్యాదులు ఈ వృక్షముల మీదనుండి కిలకిలారావములు చేయు చుండును. కోయిల కూతల కంతులేదు. ఈ దృశ్యము చూచువారి కానందముగలుగుట సహజము. ఆయింటి యజమాని కాంతారావు పేరుప్రతిష్ఠలు వ్యాపించిన వ్యక్తి. కాంతారావుతల్లి శేషమ్మకు, కన్నమ్మ యను సోదరికలదు. వీరిద్దరు గాఢానురాగమున స్నేహభావములతో, వాత్సల్యముతో మెలగుచుండిరి. వీరిద్దరికి ఏకైకమాట. ఇంట్లో తిట్టుటకూడ యిద్దరును కలసియే. వీరియొక్క సంభాషణలు, మనఃప్రవృత్తులు, వినుటకు, చూచుటకు అతికౄరముగనుండును. లోకమున నెవ్వరికిని యిటువంటి సంభాషణలు రావు. కానీ వీరిద్దరి గాఢానురాగమైన మైత్రి చీలుట విధివశముగ తటస్థించినది. ఇంత మైత్రి ఎట్లు రెండుగా విభజింపబడినదని అడుగుదురేమో? మాటలలో జాణతనమున్నదిగదా? అప్పకన్న చెల్లెలే రెండాకు లెక్కువ చదివినది. కన్నమ్మకు భర్త చిన్నతనములోనే మృతినొందెను. అంటే మరీ చిన్న తనముగాదులెండి; సుమారు పాతికేండ్ల వయస్సున్నప్పుడు. అందులో కన్నమ్మ భర్తకు రెండవపెండ్లి. మామ తహశీలుదారు. భర్తగూడా ఉద్యోగస్థుడే. పూర్వము చాల ఆస్తియుండెను. కాని మేన కోడండ్రు ఈమెను చేరదీసి ఈమె వద్దనన్న ధనము నపహరించి వెడలగొట్టిరి. క్రమక్రమముగా అంతా నశించి పోయింది. చివరి కొకయిల్లు మిగిలినది. ఆ ఒక్క యిల్లుగూడా అమ్మమనేవారే. ఇల్లు శిథిలావస్థలో యున్నది. దానిని బాగుచేయు విధమెద్ది? చేతిలో చిల్లిడబ్బైనాలేదు. పోనీ మంచిగా యుంటే ఎవరినైనా ఆశ్రయించవచ్చును. కాని నోటి మంచితన మెక్కడనుండి తెద్దాము? సరే! ఇంక ముందువిషయమెట్లు? ఉన్న ఒక్క అప్పను విడనాడుకొనెను. తిండి తినుటకా ఏమీ లేదు. ఉన్న నాడు తినుట, లేనినాడు పస్తుండుట. కన్నమ్మకు, సుభద్రమ్మయను మరదలుకలదు. ఈమె హృదయము నవనీతమువలె కరిగిపోవును. సహజముగ సాధువు. తన వదినెగారైన కన్నమ్మపడు దురవస్థ చూడలేక తానుతీసికొనివచ్చి తనకున్న ధనములోనే ఈమెనుగూడ పోషించుచుండెను. వదినెగారిఇల్లు బాగుచేయించి శుభ్రముగా చేసెను. ఇట్లు కొన్ని నెలలు గడచినది. ఒకనాడు ఈమెతోగూడ కలహమాడి తిరిగి తన సోదరిగారింటికేగెను. అక్కడ తనని పలుకరించేవారే లేకపోయిరి. పోనీగదాయని అప్పకోడలు రమ్మని యింట్లో వుండుటకు వప్పుకొనెను. ఆమె వీరియింట్లో అడుగుపెట్టిన వద్దనుంచి అప్పకు, తనకు సరిపడలేదు. అప్పను వెడలగొట్టి తనే అధికారము చెలాయించవలెనని భ్రమ పుట్టినది. అందుచే నేదో విధమైన కారణము చూపెట్టి నిష్కారణముగా కలహమాడుట మొదలిడింది. కాంతారావుకోసము పెక్కు పెద్దమనుష్యులు వచ్చుచుందురు. వారితో మాట్లాడకుండా ఒకటే రణ, గొణధ్వనులు. ఎన్ని విధముల చెప్పినను వినరు. మాటయందు ఒకరికొకరు తీసిపోరు. "చెప్పులోనిరాయి, చెవిలోని జోరీగ, కంటిలోని నలుసు, కాలిముల్లు, ఇంటిలోనిపోరు ఇంతంత గాదయా విశ్వదాభిరామ వినురవేమ" అన్న విషయము సార్థకమయింది. అనవసరపు తగవులలో దిగుచుందురు. చివరకు అప్పను స్వాధీనపరచుకొనుటకు చేతకాలేక ఓర్వలేక పోయినది. సరే! ఇంకేం? ఎదుటివారి కున్నదని విచారించిన నొక కన్నును, తనకులేదని విచారించిన రెండవకన్నును పోయినవన్న సామెత వృథాలేదు. కంటిలో పువ్వుగూడా వేసింది. ఇంక ఏమిటిగతి! మరదలు సుభద్రమ్మ ఇల్లు బాగుచేయించి తన్ను పోషింతునన్న ఆవిడతోనూ సరిపడ లేదు. పోనీయని అప్ప ఉపకారమునకుపోయి ఇంట్లో వుండమంటే ఇక్కడా సరిపడలేదు. అటూ, ఇటూ గూడా ఉపకారమునకుపోతే అపకారము ఎదురైంది. అసలే కాంతారావు కోపము మధ్యాహ్న మార్తాండుని పోలియుంటుంది. ఇట్లు కలహమాడుతుంటే ఇక ఆయన సహించలేక ఇంట్లోనుండి వెడలి పొమ్మనెను. సరే ఆమె సణుగుచూ, గొణుగుకొనుచూ బయనమై వెడలిపోయెను. ఇప్పుడు యిరుప్రక్కల వారును సుఖముగా నుండిరి.

—***—

మద్దూరి రంగనాయకి.